క్లుప్తంగా

కంది పూతపై తుపాన్ ప్రభావం



జల్లిపల్లి వద్ద కంది పూతకు గూడు పురుగు ఆశించిన దృశ్యం

కూడేరు: కంది పూతపై తుఫాన్ ప్రభావం పడుతోంది. తుపానుతో వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. కంది పూత విరబూసింది. పూతకు గూడు పురుగు ఆశించింది. గాలి బలంగా వీచడంతో గూడు పురుగు దెబ్బకు పూతంతా నేల రాలుతోంది. చోళసముద్రం, జయపురం, కరుట్లపల్లి జల్లిపల్లి, కమ్మూరు, కొర్రకోడు, ఇప్పేరు, గొటుకూరు, బ్రాహ్మణపల్లి, కూడేరు, కలగళ్ల, మరుట్ల, ఉదిరిపికొండ, అరవకూరు, పి.నారాయణపురం, కడదరకుంట, కొన్ని గ్రామాల్లో వర్షాధారం కింద ఖరీఫ్‌లో సుమారు 11,000 ఎకరాల విస్తీర్ణంలో కంది పంటను రైతులు సాగు చేశారు. పూత ఎంత బాగా పూస్తే కంది కాయలు కాయడానికి అవకాశం ఉంటుంది. తుఫానుతో పూత రాలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన



ఉచిత మెగా వైద్యశిబిరంలో 2డీఎకో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక కెనరా బ్యాంకు ఎదురుగా సమైరా పాలీ క్లినిక్‌లో అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రి సౌజన్యంతో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆప్కో మాజీ డైరెక్టర్, చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ చైర్మన్ కొత్త శ్రీనివాసులు జ్ఞాపకార్థం ఆయన తనయుడు ఉరగాద్రి చౌడేశ్వరిదేవి ఆలయ చైర్మన్ కొత్త శరత్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజీ నిపుణులు డాక్టర్ రామ్ కుమార్, ఈఎన్‌టీ డాక్టర్ అర్జున్, స్త్రీలు, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాక్షి (మస్రద్ జహ) అప్తాల్మిక్ డాక్టర్ లహరి, యూరాలజీ డాక్టర్ రంగాస్వామి 400 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేశారు.

పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

కూడేరు: ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని గ్రామ పంచాయతీల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేద్దామని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి పిలుపు నిచ్చారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల్లో అభివృద్ధి పనుల ప్రణాళిక తయారీపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు ఇతర అత్యవసర పనులకు తొలి ప్రాధాన్యత ఇద్దామన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, గృహ నిర్మాణ శాఖ డీఈ హనుమప్ప, ఎంఈఓ మహమ్మద్ బాషా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందిస్తున్నారా?

కూడేరు: ముద్దలాపురం, కుష్టురోగుల కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల సంజీవిని, బాలమృతం పౌష్టికాహార కిట్లను సక్రమంగా అందిస్తున్నారా? అని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి గురువారం ఆరా తీశారు. గర్భంలో, ప్రసవం తర్వాత శిశువు ఆరోగ్యంగా ఉండి ఎదుగుదల బాగుండాలంటే కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని ఆమె ఆమె సూచించారు. తర్వాత కూడేరులోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.అనంతరం రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అరుణ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కలుగోడు గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం సీసీ రోడ్లను ప్రారంభించారు. 75 వీరాపురం సర్పంచ్ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

హమాలీలకు బోనస్ నగదు పంపిణీ

రాయదుర్గంటౌన్: 80 మంది సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు దసరా బోనస్ నగదుతో పాటు స్వీట్లను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప గురువారం పంపిణీ చేశారు. స్థానిక లక్ష్మీబజార్‌లోని హమాలీ యూనియన్ భవనంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. హమాలీ యూనియన్ ఉపాధ్యక్షుడు నాగరాజు, సభ్యులు గొల్ల నాగరాజు, ఆంజనేయులు, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అంతా దగా.. ఎందుకీ పగ!



కూటమి మాటలు ఒక్కటైనా నెరవేరింటే ఒట్టు

- పెట్టుబడి సాయంలేదు.. పంట నష్ట పరిహారమూ ఇవ్వలేదు
- రైతులకు ఇచ్చిన హామీలపై నోరుమెదపని సర్కారు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రైతన్నలకు రూ.కోట్ల లబ్ధి
- ముందుకు కదలని బీటీపీ పనులు

వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గంలో రైతన్నలకు పలు పథకాల ద్వారా జరిగిన లబ్ధి

పథకం	లబ్ధి పొందిన రైతుల సంఖ్య	లబ్ధి రూ.కోట్లలో
వైఎస్సార్ రైతు భరోసా	54,944	రూ.34.74
వైఎస్సార్ సున్నా వడ్డీ	30,531	రూ.4.34
ఉచిత పంటల బీమా	883	రూ.13.45
సున్నా వడ్డీ పంట రుణాలు	18,529	రూ.7.88
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	450	రూ.96 లక్షలు

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల సమయంలో అన్నదాతకు పరిహారం ఇస్తాం..పెట్టుబడి సాయమూ అందిస్తాం.. దన్నుగా నిలుస్తాం.. ఆదుకుంటాం.. అండగా నిలుస్తాం.. అన్నీ చేస్తాం ..అని కూటమి నేతలు హామీలిచ్చారు. అధికారంలోకొచ్చి ఆరు నెలలవుతున్నా ..ఏ ఒక్కటీ అమలు చేయలేదు. కేవలం ఎదురుచూపులే మిగిలాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచారు. రైతు భరోసా, సున్నావడ్డీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా అనేక పథకాలతో ఆదుకున్నారు. ఎన్నో పథకాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు నోరుమెదపడం లేదు.. ఎందుకింత పగ అని అన్నదాతలు బహిరంగంగా పెదవి విరుస్తున్నారు.

నియోజకవర్గంలో ఏటా వర్షాధారం కింద 62,038 హెక్టార్లు, బోరు బావుల కింద 16,702 హెక్టార్లలో వేరుశనగ సాగవుతుంది. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో అదునులో వర్షాలు రాకపోవడంతో రైతులు వేరుశనగ సాగు చేయలేకపోయారు. ఈ సమయంలో రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం.. పెట్టుబడి సాయం ఇవ్వలేదు. పంట నష్ట పరిహారమూ అందివ్వకుండా చేతులెత్తేసింది.

ముందుకు సాగని బీటీపీ పనులు..

నియోజకవర్గానికి ఆయువుపట్టుగా ఉన్న భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీ ప్రాజెక్టు వరకు కాలువలు పూర్తి చేస్తే నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉంటుంది. అయితే ఎన్నికల ముందు బీటీపీని పూర్తి చేసి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు కాలువలు తవ్వి సాగు నీరు ఇస్తామని గొప్పలు చెప్పిన కూటమి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.. ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలని చంద్రబాబును కోరుతున్నారే తప్పా ఒక్క అడుగూ ముందుకు సాగలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఒంటిమిద్ది వద్ద అర్ధంతరంగా ఆగిన బీటీపీ కాలువ పనులు

తక్షణమే పెట్టుబడి సాయం ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయ్యింది. రైతన్నల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు అందించాలి. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందే. దళారీ వ్యవస్థను తొలగించాలి. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి. కిసాన్ రైలును పునః ప్రారంభించాలి.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

పంట నష్టపరిహారం ఇవ్వాలి



నేను ఈ ఏడాది 3 ఎకరాల్లో కంది, ఐదు ఎకరాల్లో వేరుశనగ, ఎనిమిది ఎకరాల్లో ఆముదం పంటను సాగు చేశాను. అయితే పంటల ఈ నమోదు చేశారు కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. వేరుశనగ దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. కంది ఏపుగా పెరిగినా దిగుబడి రాలేదు. ప్రభుత్వం వెంటనే రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి.

– జైపాల్ రెడ్డి, రైతు, దాసంపల్లి

వేరుశనగ సాగుపై అనాసక్తి



నేను నాకున్న 4.50 ఎకరాల్లో వేరుశనగ, టమాట పంట సాగు చేశా. అయితే ఈ సారి ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులే కరువయ్యారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంట సాగు కోసం పెట్టుబడి సాయం అందించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను పట్టించుకోవడమే మరిచారు.

– హనుమంతరాయుడు, రైతు, కైరేవు, శెట్టూరు మండలం

అవగాహనతోనే తూకాల్లో మోసానికి అడ్డుకట్ట



వరిధాన్యం తుకాలను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల అధికారి శంకర్

కణేకల్లు: రైతుల్లో వచ్చిన అవగాహనతో వరిధాన్యం తూకాల్లో మోసాలు బాగా తగ్గాయని తూనికలు, కొలతలశాఖ అధికారి శంకర్ తెలిపారు. గురువారం కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో వరిధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రదేశాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ కాటాలో తూకాలను ఆయన పరిశీలించారు. వేస్టేజ్ కోసం కేజీ, గన్నీ బ్యాగ్ బరువు కోసం 500 గ్రాములు అదనంగా తీసుకుంటున్నారని, అంతకు మించి ఎక్కువ తుకాలు ఇవ్వలేదన్నారు. ఎలక్ట్రానిక్ కాటాకు సీల్ ఉందోలేదో రైతులు గమనించి కాటా వేయించాలన్నారు. ఎలక్ట్రానిక్ కాటా కాకుండా తూకం రాళ్లు, కర్రల త్రాచుతో దళారులు ధాన్యాన్ని తూకం వేస్తే తమ దృష్టికి తీసుకోరావాలని ఆయన రైతులకు సూచించారు.

శుభకార్యం



కుందుర్పి: స్థానిక ఫాదర్ ఫెర్రర్ కళ్యాణ మంటపంలో మలయనూరు కండెక్టర్ మారెన్న కుమార్తె వాణిశ్రీ, పాస్టర్ నతానియేల్ కుమారుడు జాన్ అన్వేష్ వివాహ వేడుక గురువారం జరిగింది. వేడుకకు మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మలయనూరు మాజీ సర్పంచ్ సుదర్శరెడ్డి, కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరశింహమూర్తి, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చల్లా కిశోర్ చౌదరి తదితరులు హాజరయ్యారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్యాలయం గేటు ముందు నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలో పని చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం గేటు ముందు దాదాపు అరగంట పాటు కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈ ప్రతాప్‌కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, పారిశుధ్య వర్కర్ల యూనియన్ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు, మున్సిపాల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్‌కు కార్మికులు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపాల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శివ, వన్నూరుస్వామి, కార్మికులు శివకుమార్, వన్నూరస్వామి, వెంకటేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతి వేడుకలు



బోనాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

కుందుర్పి: మండలంలోని తెనగల్లు గ్రామంలో కనకదాస జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కనకదాసు చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో అలంకరించి తప్పెట్లు మేళతాళాలు గొరవయ్యల నృత్యాలతో ఊరేగించారు. అంతకుముందు వందలాది మంది మహిళలు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం కోలాటలు, చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం



మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

- 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పోస్టర్లు విడుదలలో మాజీ ఎంపీ రంగయ్య

శెట్టూరు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అయ్యగార్లపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి ఇప్పటికే పార్టీ అనుబంధ సంఘాలను ఎంపిక చేశారు. నూతనంగా మండల కన్వీనర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మండలంలో ఎస్సీ కమ్యూనిటీకి కన్వీనర్ కేటాయించనున్నట్లు తెలిపారు. ఎస్సీ సామాజికవర్గం నుంచి ఎవరెవరూ ఆశావహులు ఉన్నరో వారంది పేర్లు సమావేశంలో తీసుకున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారిని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తీర్చేవారికే ప్రాధాన్యత ఇస్తామని రంగయ్య తెలిపారు. శుక్రవారం అనంతపురంలో జరగనున్న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ అనే కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జెడ్పీటీసీ మంజునాథ, మజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, వైస్ ఎంపీపీలు చెవుల కిష్టప్ప, ముత్యాలు, సర్పంచులు సత్యనారాయణ రెడ్డి, భారతి, ప్రకాష్, నాగరాజు, వెంకటేశులు, పాలయ్య, ఎంపీటీసీ మల్లేష్, బీటీ ప్రకాష్, నాయకులు ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, మంజునాథ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మంజుళమ్మ, మహాబలి, వీరాంజనేయులు, రామంజనేయులు, టైలర్ వన్నూరుస్వామి, రాజశేఖర్, అనంత రెడ్డి, శ్యామ్ సుందర్, శ్రీన, ప్రకాష్, పార్టీ అనుబంధ తాలుకా అధ్యక్షులు విజయకుమార్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం: జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతుల ర్యాలీని జయప్రదం చేద్దామని ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై జిల్లా కేంద్రంలో జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కుందుర్పి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు సమష్టిగా కృషి చేద్దామని సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తదితరులు సూచించారు. గురువారం కుందుర్పిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, మండల కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై కుందుర్పి వైఎస్సార్‌సీపీ నాయకులతో చర్చించారు. నూతనంగా మండల కన్వీనర్‌ను ఈనెల 20న ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి,ఎంపీపీ నాగరాజు, వైస్ ఎంపీపీ అజయ్‌బాబు, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మాజీ వాల్మీకి డైరెక్టర్ పాలాక్షి, కుందుర్పి ఎంపీటీసీ సభ్యుడు హనుమంతరాయుడు, సీనియర్ నాయకులు వెంకటేశులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లింగప్ప, లాయర్ హనుమంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్ సర్పంచులు ఓబన్న, ప్రభాకర్, జగన్, రామూర్తి, గంగాధర, విజయ్, హనుమంతరాయుడు, అతావుల్లా, నాయకులు నిజవళ్లి బాబు, వార్డు సభ్యుడు మంజునాథ, లక్ష్మణమూర్తి, పెద్దోబిశేసు, మాజీ డీలర్ పాలాక్షి, తిమ్మరాజు, గంగాధర, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కుందుర్పి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శంకర్

కుందుర్పి: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శంకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ బాలాజీ రోడ్డు ప్రమాదంలో గాయపడగా, మెడికల్ లీవ్‌లో ఉన్నారు. గత 50 రోజులుగా ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ఏఓ శంకర్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు.

వేప్పేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంటౌన్: వేప్పేరు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డు నందు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జిల్లాన్‌బాషాను ఆటో ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని బళ్లారి రోడ్డు మదరసా ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో చదంగొల్లలదొడ్డికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న మల్లేశప్పను ఓ లగేజీ ఆటో బలంగా ఢీకొంది. డి.హీరేహాళ్ మండలం కల్యంలోని పెట్రోల్ బంకు సమీపంలో రప్పం గ్రామానికి చెందిన లింగన్న బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలు పరిష్కరించాలని దొడగట్ట బాలికల వసతి గృహం విద్యార్థినులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కోరారు. గురువారం పట్టణంలోని దొడగట్ట రోడ్డులో బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

రెండు ఆటోలు సీజ్

వజ్రకరూరు: మండల కేంద్రం వద్ద నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో వెళ్తున్న రెండు ఆటోలను ఎస్ఐ నాగస్వామి గురువారం సీజ్ చేశారు. గుంతకల్లు ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు.

మైనార్టీ అధ్యక్షుడిని సన్మానం

కంబదూరు: వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన దాదుని మండల నాయకులు గురువారం సన్మానించారు. దాదు మాట్లాడుతూ అధిష్టానం తనపై నమ్మకంతో అవకాశం ఇచ్చిందని, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎంపీ, తలారి రంగయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కో ఆప్షన్ మెంబర్ ఎస్ ఎండీ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అలీ, బాషా, బాబు, రిజ్వాన్, ఖాజా, ఫరూక్, దాదు ఫయాజ్, మన్సూర్, ఇమ్రాన్, ఖాజా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఖాజీ ఇందాదేక్ తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం

ఉరవకొండ: స్థానిక వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ పక్కన కె.ఆనంద్‌రావు అనే జర్నలిస్టు ఇంట్లో గురువారం బ్రహ్మకమలాలు విరబూశాయి. ఒకే మొక్కకు నాలుగైదు బ్రహ్మకమలాలు పూశాయి.

వివాహిత అదృశ్యం

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైందని ఆమె తండ్రి స్థానిక పోలీస్‌లకు గురువారం ఫిర్యాదు చేశాడు.

ఎస్‌డీజీ లక్ష్యసాధనకు సమష్టిగా కృషి చేద్దాం

కణేకల్లు: ఎస్‌డీజీ (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) లక్ష్యసాధన కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎస్‌డీజీ ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పేదరికం నిర్మూలన, విద్య, ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం, సమానత్వం, పరిశుభ్రమైన నీరు పారిశుధ్యం, మహిళల ఆర్థిక స్వాలంభన లాంటి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే పక్కా ప్రణాళికతో ముందు కెళ్లాలన్నారు. ఎస్‌డీజీ సాధనకు వివిధశాఖల పాత్రపై కణేకల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం ఆంజనేయులు, ఏపీఓ సుధాకర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఈఓఆర్‌డీగా సతీష్‌కుమార్

ఉరవకొండ: ఉరవకొండ ఈఓఆర్‌డీగా సతీష్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా నందలూరు నుంచి ఈఓఆర్‌డీగా ఇక్కడికి వచ్చారు. ఈఓఆర్‌డీ చంద్రమౌళి బదిలీపై కణేకల్లుకు వెళ్లడంతో ఆయన స్థానంలో సతీష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

దోమకుట్టినట్లయినా లేదు!

- ప్రతి వారం మొక్కుబడిగా డ్రైడే ఫ్రైడే
- విష జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- మడేనహళ్లిలో ఇద్దరు చిన్నారుల మృతి
- ఓపీ, ఐపీల్లో పెరుగుతున్న జ్వరపీడితుల సంఖ్య



రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి.. దోమల నిర్మూలన, వ్యాధులపై ప్రజలను చైతన్యపరుస్తూ నిర్వహించాల్సిన కార్యక్రమం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అటకెక్కింది. డ్రైడే ఫ్రైడే కార్యాక్రమాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇటీవల డీ హీరేహాళ్ మండలంలోని మడేనహళ్లిలో విషజ్వరాలతో దీవన్, మేఘన అనే ఇద్దరు చిన్నారులు మృత్యువాతపడ్డారు. కాశీపురంలోనూ ఇటీవల ఇలాంటి ఘటనలే వెలుగుచూశాయి. అయినా అధికారులకు దోమకుట్టినట్లయినా లేదు.



మడేనహళ్లిలో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ఏరియా ఆస్పత్రితో పాటు మూడు సీహెచ్‌సీలు, 30 అర్బన్, మండల పీహెచ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో విధులు నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారితో పాటు వైద్యులు, సబ్‌యునిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు డ్రైడే కార్యక్రమం నిర్వహించాల్సి ఉన్నా మొక్కుబడికే పరిమితమైనట్టు తెలుస్తోంది.

లార్వా నివారణకు చర్యలు

దోమల సంతతి ప్రదేశాలు, హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి లార్వా (దోమ) వృద్ధి చెందకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. ఇళ్లమధ్య మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలి. దోమలు పెరగకుండా .. కుట్టకుండా చూసుకోవాలి. మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ నిర్వహించాలి. డ్రైనేజీల్లో ఆయిల్‌బాల్స్ వదలాలి. మలేరియా సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు ప్రతి ఇంటినీ నెలలో రెండుసార్లు సీజన్ ముగిసే వరకూ సందర్శించాలి. జ్వరపీడితులను గుర్తించాలి. రక్త నమూనాలు సేకరించాలి. మలేరియా నిర్ధారణకు పరీక్షలు చేయించాలి. రోగం నిర్ధారణ అయితే పర్యవేక్షకులు రోగికి చికిత్స అందించాలి. చాలా చోట్ల ఈ ప్రక్రియ సక్రమంగా సాగ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలను విష జ్వరాలు చుట్టుముట్టేస్తున్నాయి.

ప్రతి వారం నిర్వహిస్తున్నాం

జిల్లాలో ప్రతి శుక్రవారం తప్పక ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పక్కాగా అమలు చేస్తున్నాం. మలేరియా కేసులు కూడా తక్కువగా నమోదయ్యాయి. వైరల్ జ్వరాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత వాతావరణంలో మార్పులతో జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం యధావిధిగా నిర్వహించాలి. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు. డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లి అన్ని పీహెచ్‌సీల పరిధిలోనూ ఈ కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఓబులు, డీఎంఓ, అనంతపురం

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

శెట్టూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రవిబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. అక్రమ మద్యం అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. అక్రమ మద్యం, గుట్కా వ్యాపారం కట్టడి చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరిశీలించి, రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని ఎస్ఐ రాంభూపాల్‌కు సచించారు.